| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| డిశంబర్ 2022 | December 2022 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 101వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 8 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 17 |
| **4.** | **దారి చూపిన సౌదామిని** | రేణుక అయ్యల సోమయాజులు | 25 |
| 5. | You are Not the Doer | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 7 | V Krithivasan | 39 |
| 7. | Devotion: The Foundation for any Spiritual Practice | Gentela Venkata Ramana | 44 |
| 8. | The Scent of the Master | | 48 |


## Events in Sri Ramana Kendram in December 2022

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 6th December - Kartigai Deepam - 6.00 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 11th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు, e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# మాటకు మూలం మౌనం

డా॥ కే.యస్. గారి 101వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

స్వాతంత్ర్యం, స్వేచ్ఛ అంటూ మనం ఎన్నో విషయాలను గురించి మాట్లాడతాం. ఇటీవలి వరకు మన మధ్యలోనే పూర్తిగా భగవాన్‌ను ఆరాధించిన ఒక భక్తుడు వుండేవారు. శ్రీ నాగరాజు అన్న ఆ భక్తుని కుమార్తె గాయత్రి ఈ రోజు ఇక్కడికి వచ్చింది. నాగరాజగారు కాన్సర్‌తో బాధపడుతుండే వాడు. మీలో చాలామందికి తెలిసి వుండవచ్చు. ఆ వ్యాధి నుండి కోలుకోలేనని తెలిసిన తరువాత ఆయన ఇక మందులను తీసుకొనడం అనవసరమని గ్రహించి తిరువణ్ణామలైలో స్థిరపడ్డారు, భగవాన్‌కు పూర్తిగా తనను అర్పించుకున్నారు. కుటుంబం అంతా ఆయనతో అక్కడే వుండి పోయింది. భక్తులు రోజూ ఆయన దగ్గరికి వెళ్ళి అక్షరమణమాల పారాయణం చేసేవారు. కొన్ని నెలల తరువాత తిరువణ్ణామలైలోనే దేహం చాలించారు. ఇందులో గొప్పతనం ఏమిటంటే ఆయన దేహ సంబంధాన్ని పూర్తిగా వదలివేయడం. నాగరాజుగారు మాత్రమే గాకుండ మొత్తం కుటుంబ సభ్యులు పరిస్థితిని ఎంతో ప్రశాంతతో ఎదుర్కొన్నారు. అది మరింత గొప్ప విషయం.

## ఆచరణ ముఖ్యం

భగవాన్ గురించి మాట్లాడడం ఒకటి. ఆయన చెప్పిన విషయాలను జీవితంలో ఆచరించగలగడం మరొకటి. ఏ కొద్దిగా

నైనప్పటికీ ఆచరణలో పెట్టడం కూడ భగవాన్ కృప వల్లనే సాధ్యమౌతుంది. మనం ఇక్కడ కలవడం తత్వశాస్త్రాన్ని గురించి మాట్లాడడానికి కాదు, సత్సంగంలో పాల్గొనడానికని గ్రహించాలి. మరెన్నో విషయాల గురించి చర్చించవచ్చు, దాని వల్ల లాభం లేదు. మరింత నిస్పృహకు లోనవుతాం. ప్రతి ఆదివారం ఇక్కడ గుమిగూడడం తెలివి, వివేకాలను గురించిన అనుమానాలను తీర్చుకొనడం కోసం కాదు. ఒకే రకమైన ఆలోచనలు గల వ్యక్తులు కలిసి గురువు, లేదా దేవుడిని గురించి చర్చించినప్పుడు, ఒక అర్థం కాని, అనూహ్యమైన శాంతిని అనుభవిస్తాం. చర్చించడం మంచిదే. సత్సంగానికి వచ్చిన వారిని తమ ఆధ్యాత్మిక అనుభవాలను మనతో పంచుకోవాలని అడుగుతాం. అలాగని వాళ్ళ ప్రసంగాలు మాత్రమే ముఖ్యం కాదు. మొదటిసారి సత్సంగానికి వచ్చిన భక్తులను అరుణాచల నామాన్ని స్మరిస్తూ, జపిస్తూ, గంట, గంటన్నర పాటు మౌనాన్ని పాటించడం చాలా మంచిదని తెలియపరుద్దాం.

## మనసుకు అతీత స్థితి

అసలు మనకు కావలసినదేమిటి? స్వేచ్ఛ, స్వేచ్ఛ - దేని నుండి స్వేచ్ఛ? మన మనసుల నుండి స్వేచ్ఛ, ప్రశాంతమైన స్థితి : నిజంగా మనం కోరేది స్వేచ్ఛ, బానిసత్వాలను మించిన స్థితి. ఈ స్థితిని గురించి మనం చెప్పాలంటే మళ్ళీ మనసును ఉపయోగించాలి. బంధాముక్త్యతీత పరమం సుఖం. కాని మన పరిమితమైన మనసుతో, మనసుకు మించిన విషయాలను మనం గ్రహించలేము అని భగవాన్ అంటారు. మనం ప్రతిరోజూ ఆ స్థితిని గాఢ నిద్రలో అనుభవిస్తాం. అప్పుడు మన శరీరం గురించి గాని,

మన మనసు గురించి గాని ఏ విధమైన స్పృహ వుండదు. అయినప్పటికీ, ఎంతో హాయి అనిపిస్తుంది. అహం గానీ, ఏ విధమైన వ్యక్తిత్వ భావనగానీ వుండదు. అది మీకు అనవసరమైన బుజువును చూపిస్తుంది. అందుకే ఎంతగా చర్చించనప్పటికీ ఉపయోగం వుండదు. ఈ విషయాన్ని గ్రహించినప్పుడు మీరు ఏమి చెయ్యాలో చూడండి. ప్రభువుకు నీవు సంపూర్ణ శరణాగతి చెందాలి లేదా నీవెవరో తెలుసుకోవాలి. భగవాన్ మరొక ముఖ్యమైన సంగతి కూడ చెప్పారు.

బౌద్ధికంగా ఇలాంటి నిర్ధారణ చేసే ముందు, ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపే ఒక అతీత శక్తి వుందన్న నమ్మకాన్ని ఏర్పరచుకోవాలి. భగవాన్ గురించి తలచుకునేందుకు కూడ ఆయన దయ, కృప అవసరం. ఇది అనుభవపూర్వకంగా ఎఱుకలోకి వచ్చే విషయం. ఏదో వివరణల వల్ల తెలుసుకునేది కాదు. నేను చక్కని పదాలను ఉపయోగించి ప్రయత్నించినప్పటికీ, అది అనుభవంతో సమానం కాదు. ఒక మిఠాయి-లడ్డును గురించి, దాని రుచి గురించి నేను వర్ణించినప్పటికి, అది అనుభవిస్తే గాని అవగతం కాదు.

మీరు రోజూ ఉదయాన్నే ధ్యానం చేస్తుండవచ్చు. కాని ఒక వంద సంవత్సరాలు ధ్యానాన్ని గురించి మాట్లాడినప్పటికి, ఆ ప్రక్రియ తెలియకపోవచ్చు. ఒక్కొక్కరు, ఒక్కొక్క పద్ధతిలో ధ్యానం చేస్తారు. అందరికీ పనికి వచ్చే మార్గాన్ని చెప్పమని అడిగినప్పుడు భగవాన్ అలా వీలు కాదన్నారు. అలాంటిది వుండదనీ, ప్రత్యేకంగా తమకు నచ్చిన విధంగా జరుపుకున్న తరువాత, దాని విలువ తెలియవచ్చి, కోరుకున్న ఫలితం అనుభవిస్తారనీ అన్నారు.

బంధముక్త్యతీత పరమం సుఖమ్ - బంధాలు, స్వేచ్ఛ, వీటిని మించిన స్థితి. అలాంటప్పుడు దాని గురించి మనమేమి చెబుతాం? మనం రమణకేంద్రంలో కలవడానికి కారణం ఇదే. మనకు లభించే శాంతి (బుద్ధి పరంగా కాదు) మనకు తెలియవస్తుంది. గంట, గంటన్నర పాటు కేంద్రంలో మనం కలుసుకున్నప్పుడు భగవాన్ ద్వారా మనకు ప్రశాంతత సమకూరుతుంది. ఆయన, ఇక్కడ, మరిన్ని చోట్ల కూడ వున్నారు. భగవాన్ స్వయంగా ''నేను వెళ్ళిపోతున్నాను'' అంటున్నారు. నేను ఎక్కడికి వెళ్ళగలను? ఇక్కడే వున్నాను'' అన్నారు. ఆయన ''ఇక్కడ వుంటాను'' అని కాదు. ''ఇక్కడే వున్నాను'' అని అన్నారు.

తీర్థయాత్రలకు వెళ్ళడం, చర్చలు జరపడం, గుళ్ళను దర్శించడం, ఇవన్ని చేసినప్పటికి, సత్సంగం ముఖ్యమన్నారు భగవాన్. ఒక ప్రదేశంలో కలిసి, గురువును గురించిన వీలైనంత సేపు ధ్యానించడం, మనశ్శాంతిని ఇస్తుంది. ఆ శాంతి మరి దేనితో గాని పోల్చలేనిది. అందుకే భగవాన్ సత్సంగాన్ని మించినదేమీ లేదన్నారు. అప్పటికీ మరేదైనా కావాలని కొందరు భావిస్తే, ఈ కేంద్రంలో సత్సంగం తరువాత జరుగుతుంది. ప్రధానంగా భక్తులు ప్రశాంతత కోసం కేంద్రానికి వస్తారు. కొంతసేపు ధ్యానంతో అది లభిస్తుంది. అలాగని, చర్చలకు ప్రాధాన్యత చూపించే వాళ్ళను తక్కువ చేసి మాట్లాడే ఉద్దేశం కాదు. నిజానికి, అలాంటి చర్చల కోసం ఎక్కువ సేపు ఎంతో మంది వుంటారు. ఆ భక్తులను దృష్టిలో వుంచుకొనడం వలన కొంత సమయం కేటాయించడం జరుగుతోంది. కాని దాని స్వభావం వేరుగా వుంటుంది.

మీలో ప్రతి ఒక్కరూ స్వీయ అనుభవాలను వ్యక్తపరిస్తే అదే అతని/ఆమెకు సంబంధించినంత వరకు అనుభవాలుగా చెలామణీ అవుతుంది. ఆ అభిప్రాయంతో కొందరు ఏకీభవించకపోవచ్చు. సాధారణంగా చర్చల్లో ఒకరి వాదనకు విరుద్ధంగా ప్రతివాదనలు వచ్చే సందర్భాలు వుంటాయి. ప్రతి ఒక్కరు ఒక మార్గాన్ని ఎంచుకుని వుంటారు. దాని నుండి లాభం పొందవచ్చు అన్న దానిలో ఏ ఇబ్బంది వుండకూడదని నాకు అనిపిస్తుంది. అదే ఇక్కడ మన కేంద్రంలో జరుగుతోంది. నా ఉద్దేశంలో మన కేంద్రం లాంటి సంస్థల కార్యక్రమాలలో, భక్తులు ఒక చోట చేరి గంట, గంటన్నర పాటు నిశ్శబ్దంగా కూర్చొని, వెళ్ళిపోవడం ఉత్తమమని నేను భావిస్తాను. ఎన్ని భాషణలు చేసినప్పటికీ, భగవాన్ అంతకంటే విలువైన శాంతిని మన నిశ్శబ్దం ద్వారా లభింపజేస్తారని నా నమ్మకం. ఇది ఒక భ్రమ మాత్రమేనని చాలా మంది అనుకోవచ్చు. వాళ్ళు దాని వల్ల ఏమీ లాభం వుండదు అని భావించినప్పటికీ అది తప్పకుండ ఒక అనుభవం అన్న దానిలోనైతే సందేహం లేదు కదా! అందుకే నా అభిప్రాయంలో సత్సంగం తరువాత భక్తులు వాళ్ళ వాళ్ళ స్వానుభవాలను ఇతరులతో పంచుకొనడం మంచిది. భగవాన్ "మాటలు మౌనం నుండి ఉద్భవిస్తాయి, మళ్ళీ నిశ్శబ్దంలోనికి వెళ్ళిపోతాయి" అనేవారు. అందుకే మాటకు మూలం మౌనం. మనసు మౌనంగా వున్నప్పుడు 'మాట' అనే మాధ్యమం లేకుండ విషయ ప్రసారం ఎక్కువ సమర్థవంతంగా అవుతుంది. మనం అది అసాధ్యమని భావిస్తున్నాం. కాని నమ్మకం ఏర్పడే వరకు ప్రయత్నిస్తూ వుంటే, భగవాన్ కృపతో మనం మాట అవసరం లేదని తెలుసుకొన గలుగుతాం.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 26వ పద్య తాత్పర్యము

అన్నిటికిని క్రిందుగ (తక్కువగా) గల పాతాళము మొదలు సర్వమునకు పైన మహోన్నతమని తెలుపబడు శక్తి పర్యంతము, ఒకటి కొకటి ఆధారమై నిల్చు తత్త్వములైన యివన్నియు, ఎవరిచే శూన్యభావమను ఆయుధముచే వీగుచున్నవో, వారే శూరులన బడుచున్నారు. ఆ శూరులే నిర్విషయ జ్ఞానులని తెలుసుకొనుము.

## వ్యాఖ్య

అన్ని వృత్తులకు జీవము నిచ్చు శక్తి చూపునకు ఆనదు. ఈ శక్తియే అన్ని తత్త్వములలోను చాలా శ్రేష్ఠమైనది. పాతాళమనగా అంతకన్నా చొచ్చుకొని వెళ్ళుటకు వీలులేని క్రింది లోకము. చాల శ్రేష్ఠమైన శక్తి మొదలు అతి క్రింది గల పాతాళము వరకు, రెంటికి మధ్యగల అన్నియు ఒక దానితో మరొకటి ఆశ్రయించే యున్నవి. ఇట్లు ఒకదానికి మరొకటి ఆశ్రయించి పనిచేయబడునన్నియూ, శూన్య భావమనెడు ఆయుధముచే ఎవరివల్ల వీగుచున్నవో, వారే శూన్య జ్ఞానులగు శూరులు. శూన్యభావము నొందిన నిర్విషయ జ్ఞానికి, అన్యమైన విషయములు లేకపోవుట వల్ల అవి రాలిపోవు చున్నవి. యద్భావం తద్భవతి అన్నది పూర్వుల మాట కదా!

"నేనెవరు" అను శ్రీ భగవానుని బ్రహ్మాస్త్రమువలె, అన్నిటిని శూన్యమయముగ చేయు ఇది శూన్యమను అస్త్రము అని చెప్పబడినది. "ఉన్నాను" అను స్ఫురణ మాత్రము హృదయములో

నుండి, మిగిలినవన్నియు శూన్యముగా, దృశ్యరహితముగా, తనను తాను రమించు స్థితప్రజ్ఞునే శూన్య జ్ఞానినిగ తెలిసికొనుము అని ఈశ్వరుడు పార్వతిదేవికి చెప్పుచున్నాడు.

## 27వ పద్య తాత్పర్యము

విషయ భోగములపై ఆశ తీరక, మాటిమాటికి వాటినే తలచి మర్కటమును మించి సదా చలించు మనస్సును బహిర్విషయముల పట్టి పోకుండ అంతర్ముఖము చేసి, సర్వశూన్యమైన పదమును స్థాపించి, స్థిరమగునట్లు చేయుము. అట్లు చేయుటచే అది సాక్షాత్తుగ ముక్తిపదమును చెందును.

## వ్యాఖ్య

విషయ భోగముల ననుభవించు మనస్సునకు "చాలు" అన్న తృప్తి కలుగదు. మరియు అనుభవించుటతో వాటిపై ఆశ వృద్ధి చెంది, వాటినే తలచితలచి సదా చలించి తికమకపడుచున్నది. అందువల్లనే మనస్సును కోతితో పోల్చుదురు. అగ్నిలో ఆజ్యము ఆహుతి చేయుటచే, ఎట్లు అగ్ని మరింత ఉద్ధృతమగుచున్నదో, అట్లే ఆశలు అనెడు మంటలలో, విషయమనెడు నెయ్యిని పోసిన, ఆ మంటలు లేచి ఎంత పోసినా చాలదన్నట్లు పోరాడును. దీనినే "విషయ భోగములపై ఆశ తీరని" స్థితి అందురు.

దీనిని చలించకుండా చేయవలెనన్నచో దీనికి విషయములను అర్పించ కూడదు. అదే ఉపాయము. మనస్సు బహిర్గతమై జగత్తును అనుసరించి పోవునపుడు విషయ సేకరణ చేయుచునే యుండును. కనుక మనస్సును అంతర్ముఖము చేసి సర్వశూన్యములో స్థాపించ వలెను. సర్వశూన్యములో స్థాపించుట యనగా ఆకాశములో

చుక్కపెట్టు నట్లగును. మనస్సును శూన్యములో నుంచిన పట్టుకొనుటకు విషయములు లేక అణగిపోవుచున్నది. విషయభోగమే పురుషార్థమను భావము పూర్తిగ తొలగి శాంతము నొందుచున్నది. విషయేచ్ఛలుడిగి కర్మేంద్రియములణిగి మనస్సు శూన్యములో లయించి నాశనమొందుచున్నది.

## 28వ పద్య తాత్పర్యము

సృష్టియందలి సకల తత్త్వములలో, అభిన్నముగ, దేహమే నేనను దేహాత్మ భావ అహంకారమునకు అన్యముగా, నేనను సద్వస్తువునకు అనన్యముగా ప్రకాశించు, పరిపూర్ణ చిత్స్వరూప జ్ఞానమే, అంతటా వ్యాపించి యుండు సత్యస్వరూపమగు వస్తువు.

## వ్యాఖ్య

తత్త్వమనునది ఒక వస్తువు యొక్క స్వాభావికమైన లక్షణము. సకల తత్త్వమనగా సృష్టిలో గల తొంభై ఆరు (96) తత్త్వములను సూచించును (శైవ సిద్ధాంత గ్రంథములలో, అశుద్ధతత్త్వములు 24, శుద్ధాశుద్ధ తత్త్వములు 7, శుద్ధ తత్త్వములు 5 ఇవన్ని కలిపిన 36, ఇవిగాక బాహ్యేంద్రియ తత్త్వములు 60 మొత్తము 96. సృష్టి అంతయు ఈ 96 తత్త్వములతో నిండినదని శాస్త్రములలో చెప్పబడినది.

ఇన్ని తత్త్వములలోను ఏకమై నిలుచు వస్తువు, శరీరము నేనను తలచు అహంకారమునకు మాత్రము అన్యముగా నున్నది. దేహాత్మ భావము తప్ప ఇతర తత్వములలో కలసి, అంతటనూ సర్వతోముఖ వస్తువుగా ప్రకాశించుచున్నదని ఉపదేశింపబడు చున్నది. ఇట్లు అభిన్నమై యుండు పూర్ణ స్వరూపమే అంతటను

నిండియుండు వస్తువు. దైవము యొక్క సహజమైన పరిపూర్ణత్వ మును సంగ్రహించి, దేహము నేను అని భావించునపుడు, ఆ దైవము మనకు అన్యమగుచున్నాడని ''దేహమే నేనను దేహాత్మ భావన అహంకారమునకు అన్యముగా'' అనుచున్నారు.

ఈ పరిచ్ఛిన్నభావము పోయినచో ఉన్నది అంతట నిండిన పూర్ణ వస్తువే. తాము భగవంతుడికి ఆహారముగ అంకితము కావలెనని ఆలోచించక, భగవంతుణ్ణే తనకు లోబర్చుకొనవలెనని అనుకొని భ్రమించువారే దేహాత్మ భావము గలవారు.

## 29వ పద్య తాత్పర్యము

ప్రియమైన దేవీ వినుము! పూర్ణ వస్తువు ఆకాశము వలె, అఖిల భువనములలోను బయటనూ, ఒకే స్వరూపముగా వ్యాపించి అంతటా నిండి, నిరాకారమై తోచుచున్నది. అటువంటి ఆనంద మయమైన వస్తువు నందు మునిగియుండువారు, ఆ పరమానంద రూపులే యగుదురు. (తపశ్శ్రేష్ఠులైన ముని పుంగవులేయగుదురు) ఆహా! ఇది ఎంత విచిత్రమో చూడుము!

## వ్యాఖ్య

ఈ చర్మచక్షువులకు ప్రపంచమంతటా నిండి కనిపించునది ఆకాశమే. పైగా అదొక్కటే అంతటా ఒకే విధముగా ఎటువంటి హెచ్చుతగ్గులు లేక వ్యాపించి యున్నది. ఆ విధముగనే పూర్ణ వస్తువు అఖిల భువనములలోను బయటను ఒకే విధముగా వ్యాపించియున్నది. దానికి రూపము లేదు. రూపములతోనున్న అన్ని వస్తువుల లోపల బయట నిండియున్న ఆ వస్తువు నిరాకార మైనది. పైగా, అతి సూక్ష్మవస్తువుగా నుండుట చేతనే అంతటా

నిండియున్నది. దానికి రూపము లేక పోయిననూ, ఛాయా పురుషుని వలె ఆనందవే రూపమైయున్నది. ఆ ఆనంద రూపములో మునిగినవారు ఆనంద స్వరూపులే యగుదురు. స్పర్శవేధి ఇనుమును స్వర్ణముగా మార్చునట్లు, తనలో మునిగిన వారిని ఇది తన్మయముగనే మార్చుచున్నది. ఇది ఎంత ఆశ్చర్యకర విషయమో చూడుము! ఆహా! అని భ్రమను కలిగించునట్లు తోచుచున్నది.

## 30వ పద్య తాత్పర్యము

దహించుటకు (కాల్చుటకు) అగ్ని ఎట్లు తన జ్వాలను తనంతట తానే మెల్లగా, కొంచము కొంచము చల్లార్చుకొనుచున్నదో అదే విధముగ, పట్టుకొనుటకు విషయములు లేక నాశమొంది నచో, అనేక వ్యవహారములను పట్టి తిరిగెడి మనస్సు కూడా, తనంతట తానే పట్టుల నుండి విడిపడి శాంతించుచున్నది.

## వ్యాఖ్య

ఒక అగ్నిగుండములో అగ్ని ప్రజ్వలించి మండుచున్నది. దానిని శాంతింపజేయవలసి వచ్చినచో మంటలో కట్టెలను వేయకూడదు. అదే విధముగ మనస్సును శాంతింపజేయవలెననగా దానిని విషయములను పట్టకుండ చేయవలెను. పైగా మనస్సు విషయ భోగములను అనుభవించగా, వాటి వాసనలు దానియందు ధృఢపడి, వాటినే మరల తలచి, కలవరించి, వ్యామోహముతో ఆవేదన చెందుతున్నది.

విషయములను పట్టుకొని, వాటిని అనుభవించి దాని ద్వారా శాంతిని పొందవలెనని తలచుట, అగ్నిని ఆపుటకు అందు

ఆజ్యము పోయునట్లుగును. విషయరహితమైనచో మనస్సు తనంతట తానే మెల్లగా అణగిపోవును. దానిని మనోవాక్కాయముల చేత పట్టుటకు విషయరహితముగ చేయవలెను. అట్లు చేయగా అంతటా వ్యాపించిన మనస్సు చివరకు నిస్తేజమై కృంగి నశించు చున్నది. మనస్సును అణచుటకు శాంతింపచేయుటకు ఇంతకు మించిన ఉపాయము వేరేదియులేదు.

## 31వ పద్య తాత్పర్యము

అత్యాశతో ఒక వస్తువును చూసి మోహము చెందుట, మోహించిన వస్తువుపై గల దాహముతో మైకము నొందుట, ఉలిక్కి పడి మూర్ఛనొందుట, స్వప్నముగాంచుట, మొదలగు ఈ నాలుగు అవస్థలనూ, అంధకారమయమైన నిద్రనూ, దానితో మెలకువ యనెడి జాగ్రదవస్థనూ, వేర్వేరుగా చెప్పబడు ఈ అవస్థలన్నిటినీ, నశింపచేయవలెనని తెలిసికొనుము.

## వ్యాఖ్య

మోహము, మైకము, మూర్ఛ ఈ మూడునూ ఒకే అవస్థ యొక్క వేర్వేరు స్థితులగును. ఒక వస్తువుపై తీరని ఆశతో దానినేవాంఛించి, దానిపై మనస్సు లగ్నమై స్థితి తప్పినదే మోహము.

మనస్సు, తాను ఆశించిన లేక వాంఛించిన వస్తువు దొరకనిచో లేక వ్యామోహముచే ఒక వస్తువును ఉన్నదున్నట్లు తెలిసికొనక భ్రమించుటయే మాయ. మోహించిన వస్తువుపై గల తీరని వాంఛాదాహముతో, అది తనకు లభించకపోయిన, విరహవేదనతో మైకము నొంది ప్రజ్ఞను కోల్పోవుటయే మూర్ఛ. లేక తాను ఆశించని, ఎదురుచూడని విషయములను వినుటవల్లనో, అవి

జరుగుటవల్లనో కలుగు అదురుబాటుతో ప్రజ్ఞను కోల్పోవుట మూర్ఛయందురు. ఈ మూడింటిని, వీటితో స్వప్నము, మెలకువ, సుషుప్తి అను మూడింటితో కలిపి అన్నిటిని నాశము చేయవలెను. వీటిలో ఏ ఒక్కటినీ వాంఛింప తగదు. ఇవన్నియూ అజ్ఞాన గణము లోనివే. కనుక, కొంచమైననూ శేషముంచక నాశము చేయవలెనని బోధించుచున్నారు. ఇట్లు నాశము చేయుటయే శుభము కలుగచేయును.

## 32వ పద్య తాత్పర్యము

ఈ దేహములో ఎటులనో అతి సూక్ష్మముగా ప్రవేశించిన, ప్రాణము, మనస్సు, బుద్ధి, అహంకారము, అంతఃకరణములు మొదలగు వీటన్నిటికీ, ఏక స్వరూపముగా ప్రకాశించు చిత్స్వరూపము అన్యమేయని ధ్యానించుటచే అచిత్స్వరూపమును పొంది అందే లయమగుదువని తెలిసికొనెదవుగాక.

## వ్యాఖ్య

ఒక గారడివాని యొద్ద నున్న క్షుద్రశక్తి వలె ఆవరించి, దోషములను గుణములుగా చూపి అనేక ప్రవృత్తులను సృష్టించి, మనస్సు, ఉప్పొంగిన కడలికి సమానముగా, ఉవ్వెత్తున లేచుచున్నది. అయితే దానికి ఒక రూపమంటూ లేదు. సదా సుఖ దుఃఖములను అనుభవించి తీరని వేదన చెందు అసత్యరూపియగు జీవుడు, ప్రాణము, మనసు, బుద్ధి అను విడదీయలేని తన సహచరులతో, సృష్టిలో అతి విచిత్ర సృష్టియగు ఈ దేహములో ఎట్లో చాల సూక్ష్మముగా ప్రవేశించి తిష్ఠవేయుచున్నది. ఇట్లు ప్రవేశించిన వానిని బయటకు నెట్టుట బహుకష్టము. ఒకనిని

బయటకు నెట్టివేయుటయే కష్టమనగా, ఇతని సహచరులను బయటకు నెట్టుట మహాకష్టము. జొరబడిన వాడు యజమానివలె నటించి హక్కుతో దేహమును పాలించుచున్నాడు. ఇష్టారాజ్యము చేయుచున్నాడు. తమ ఇచ్ఛానుసారమే ఇంద్రియములు కూడ నడచుకొనుచున్నవి. వాటి ఆదేశములే ఇంద్రియములకు ప్రేరణ. ఈ విధముగా ఇష్టారాజ్యమేలుచున్న వీనిని బయటికి గెంటి వేయవలెనన్న దానికి ఒకే మార్గము, వానిని లెక్కచేయక ఉదాసీనముగా ఉన్నచో అవి భయపడి పారిపోవును. ఎట్లు సూక్ష్మముగా ప్రవేశించెనో అంత సూక్ష్మముగనూ వెడలిపోవును.

## 33వ పద్య తాత్పర్యము

నిద్రచేతను, అనేక తలపులను ఆలోచించుట, తలంచుట చేతనూ మనస్సు మూర్ఖత్వము మితిమీరి, అవివేకముతో సదా దుఃఖించి పాడైపోవును. ఇటువంటి మనస్సునకు, స్వస్థితిలో నుండిన, సుఖము కలుగునని బోధించి, తన ప్రయత్నము చేతనే చిత్తమును బహిర్ముఖము కాకుండ, తన సహజ స్థితిలో నుండునట్లు చేయుము. పట్టు విడవక, మరిమరి ప్రయత్నించి ఆ స్థితిలో మనస్సునుంచెదవుగాక.

## వ్యాఖ్య

"తన సహజ స్థితిలో నుండునట్లు చేయుము" అనగా మనస్సు తలపులను ఆలోచించుటకు తావివ్వక, తన ఉత్పత్తి స్థానమైన స్వరూప స్థితిలోనే వుంచి దానిని నిర్విషయముగా చేయుట అన్న మాట.

ఒకడు తన జీవితములో సగము రోజులు నిద్రలోనే గడుపు చున్నాడు. మిగిలిన సగము రోజులలో సదా దేనినో తలచుచూ ఆలోచించుచూ దానివెంట పోవుచున్నాడు. వెదకుచున్న వస్తువు దొరికినను దానితో ఆగుటలేదు. దానికంటే మరొక గొప్ప వస్తువును పొందుటకు, ఇంకనూ ప్రయత్నించుచున్నాడు. అనుకొన్న వస్తువు దొరకనిచో దానిని పొందుట యెట్లని ఆలోచించి బాధపడి నిట్టూర్చు చున్నాడు. ఇట్లు మారి మారి తలచుటచే, మనస్సు తన స్వతః సిద్ధమైన బుద్ధిని కోల్పోయి మూర్ఖత్వము మిగిలి, వివేకమును కోల్పోవుచున్నది. ఇట్లు ఊగిసలాడు మనస్సునకు బహిర్ముఖమైన విషయములను పట్టుకొని పరుగిడక, తన సహజ స్థితిలో నుండుటయే సుఖమని బోధించి, దానిని ఒకే స్థితిలో నుంచుటకై ప్రయత్నించుమని చెప్పుచున్నారు.

ఆ ప్రయత్నము కూడా ఒక పర్యాయము చేసిన చాలదు. ఇంకనూ ప్రయత్నించి మనస్సును స్థిరపరచవలెనని ఉపదేశించు చున్నది. నిద్రయనునది భగవంతుడు జీవునకు ఇచ్చిన ఒక అవస్థ యగును. దానిని మీరుటకు ఎవరికి సాధ్యము కాదు. ఇతను వద్దన్నా అది వదలదు. సాధారణ మనిషి యొక్క స్థితి ఎటువంటి దనగా, ఒకప్పుడు నిద్రలోనుండుట, లేదా మెలకువగా వుంటూ సదా దేనిగురించో ఆలోచిస్తూ గాలిమేడలు కట్టుచుండుట. దీని వల్ల చిత్తము తలపులచే ఆవరింపబడి దాని ప్రకాశము క్షీణించుచున్నది. తనంతట మనస్సు అంతర్ముఖము కానిచో, అభ్యాసముచే స్థిరమగునంత వరకు, ప్రయత్నముచే దానిని గ్రహింప చేయుము అని తెలుపుచున్నారు. (సశేషం)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ టి.ఆర్.ఎ. నారాయణ

**మల్లాది ఫణిమాల**

శ్రీ టి.ఆర్.ఎ. నారాయణ గారు మద్రాసుకు చెందిన ఒక బ్రిటిష్ కంపెనీలో మేనేజర్‌గా పని చేసేవారు. 1948వ సంవత్సరంలో శ్రీరమణుల గురించి ఒక రైలు ప్రయాణంలో విన్నారు.

చిన్న చిన్న ఊళ్ల పర్యటన చేస్తూ ఆ పర్యటనలో భాగంగా అరుణాచలం వెళ్లడానికి శ్రీ టి.ఆర్.ఏ. నారాయణ గారు మరియు వారితో కలిసి ఉద్యోగం చేస్తున్న శ్రీ పార్థసారథి గారు - వీళ్లిద్దరూ బయలుదేరారు. రైలు టికెట్ కొనుక్కుని తిరువణ్ణామలై వెళ్లే రైలు ఎక్కారు. రైలు ఎక్కి కూర్చున్నాక ఒక వింత దృశ్యాన్ని వీళ్ళిద్దరూ చూశారు. అదేమిటంటే వాళ్ళు ఎక్కిన కంపార్ట్మెంట్ లోకి ఎక్కడానికి ఒక లావుపాటి యువకుడు ఎంతో కష్టపడుతున్నాడు. అతడు స్థూలకాయి కావటంతో, శరీరాన్ని అటూ ఇటూ తిప్పుతూ రైలు కంపార్ట్మెంట్ లోకి ప్రవేశించడానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు. ఆ యువకుడితో పాటు వెంట వచ్చిన అతని పనివాడు ఫ్లాట్ ఫార్మ్ మీద నిలబడి అతన్ని కంపార్ట్మెంట్‌లోకి తోస్తున్నాడు. ఇంత ప్రయత్నిస్తే కానీ స్థూలకాయము గల ఈ యువకుడు కంపార్ట్మెంట్ లోకి ప్రవేశించలేకపోయాడు. కాసేపు ఆయాసపడుతూ తాను రిజర్వ్ చేసుకున్న బెర్త్ మీద కూర్చున్న తర్వాత రైలు ప్రారంభమైంది. ఆ లావుపాటి యువకుడు టి.ఆర్.ఏ. నారాయణ గారి వద్దకు వచ్చి

తనను తాను పరిచయం చేసుకున్నాడు. తన పేరు రతిలాల్ ప్రేమ్ చంద్ షా అని చెప్పి, గుజరాత్ రాష్ట్రానికి చెందిన గొండాల్ అనేటటు వంటి ప్రాంతానికి చెందిన వాడినని ఆ ఊళ్లో తాను ఒక పేరు మోసిన వ్యాపారస్తుడి కుమారుడనని తన్ను తాను పరిచయం చేసుకున్నాడు. దురదృష్టవశాత్తు పదవ ఏట నుంచి తన శరీరం లావు ఎక్కడం మొదలైంది. ఇప్పుడు ఆ యువకుడి వయస్సు 25 సంవత్సరాలు. స్థూలకాయంతో బాధపడుతున్న ఈ యువకుడికి ఒక రోజు రాత్రి ఒక యోగి స్వప్న దర్శనం ఒసగి, తన వద్దకు రమ్మంటూ పిలిచారట ఆ యోగి.

ఈ స్వప్నం చాలాసేపు ఉంది. మెళకువ వచ్చిన తర్వాత కూడా ఆ యోగి యొక్క తేజోస్వరూపము రతీలాల్ మనసులో కనపడుతూనే ఉంది. రెండు రోజుల తర్వాత రతీలాల్ భార్య ఒక గుజరాతి పత్రిక చదువుతుండగా ఆమె వెనకాల నిలబడి అతను ఆ పత్రికను చూడడం జరిగింది. ఆశ్చర్యమేమిటంటే, ఆ పత్రికలో తనకు కలలో కనిపించి పిలిచిన యోగి ఫోటోని చూశాడు రతీలాల్! తర్వాత ఆ యోగి పేరు భగవాన్ శ్రీ రమణ మహర్షి అని ఎవరో చెప్పగా తెలుసుకున్నాడు. వెంటనే తన తండ్రి దగ్గరకు వెళ్లి అరుణాచలం యాత్రకి అనుమతిని కోరాడు. అతనితో పాటు కొన్ని సంవత్సరాలుగా వాళ్ళ ఇంట్లో నమ్మిన బంటులా పనిచేస్తున్న పనివాడిని కూడా తీసుకొని బయలుదేరాడు రతీలాల్ ప్రేమ్ చంద్ షా. స్వప్నంలో శ్రీ రమణులు కురిపించిన చిరునవ్వు, వారి ఆధ్యాత్మిక సౌరభము మరియు వాత్సల్యపూరితమైన వారి ఆహ్వానం వల్ల వారి దర్శనం చేసుకున్న తర్వాత ఎన్నో సంవత్సరాలుగా తనను

పట్టిపీడిస్తున్న తన బాధ పోతుందనేటటువంటి గట్టి నమ్మకంతో రతీలాల్ అరుణాచలానికి ప్రయాణమయ్యాడు. శ్రీ టి.ఆర్.ఏ. నారాయణ గారి సహ ఉద్యోగి అయిన పార్థసారథి గారు అంతకు ముందే శ్రీరమణుల దర్శనం చేసుకున్నారు. శ్రీరమణ వైభవాన్ని వర్ణిస్తూ రచింపబడిన అనేక పుస్తకాలు కూడా అప్పటికే వారు చదవడం జరిగింది.

శ్రీ పార్థసారథి మరియు రతీలాల్ ప్రయాణం చేస్తున్నంత సేపు కూడా శ్రీరమణుల గురించే సంభాషించుకోవడం శ్రీ నారాయణ గారిని ఎంతో ఆనంద పెట్టింది. నారాయణ గారు చేతిలో ఒక ఇంగ్లీష్ నవల పట్టుకుని చదువుతున్నారన్నమాటే కానీ శ్రీ పార్థసారథి మరియు రతీలాల్ గారి సంభాషణ అంతా కూడా ఎంతో ఆసక్తితో వింటూనే ఉన్నారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నారాయణ గారు మరియు పార్థసారథి గారు శ్రీరమణాశ్రమంలో అడుగుపెట్టారు! అక్కడ వరండాలో దాదాపు 50 మంది భక్తులు ఉండడాన్ని వారిరువురు గమనించారు. రతీలాల్ మరియు అతని పనివాడు కూడా అక్కడే కూర్చుని ఉన్నారు. గురు రమణులు ఇంకా సోఫాలోకి రాలేదు...

కాసేపు శ్రీ రమణుల కోసం ఎదురు చూశాక వారు అక్కడికి వచ్చేలోగా శ్రీ రమణాశ్రమ ఆవరణను చూసి వద్దామనే ఆలోచనతో పార్తసారథిగారు మరియు నారాయణగారు అక్కడ నుంచి లేచి వెళ్లారు. కాసేపు శ్రీరమణాశ్రమం యొక్క ఆవరణంతా కూడా దర్శించి మళ్ళీ శ్రీ నారాయణ గారు మరియు పార్థసారథి గారు వరండా సమీపిస్తూ ఉండగా, "ఛీ!! ఆసడే!!" (ఛీ॥ కొంటెవాడా!!)

అనే మాటలు వినబడ్డాయి. ఆ మాటలు ఎవరో పసిపిల్ల వాడి మాటలుగా తోచాయి. అక్కడ బెండకాయ, వంకాయ, మొదలైన కాయగూరలు పండిస్తున్న చిన్న తోట ఒకటి కనిపించింది. నారాయణ గారికి మరియు పార్థసారథి గారికి ఆ తోటలో మొక్కల ఆకులు తుంచి వేస్తున్న రవళి కూడా వినిపించింది!! ఇంకొంచెం లోతుగా పరిశీలిస్తే వాళ్లకి కనిపించిన దృశ్యం ఏమిటంటే అక్కడ ఒక కోతి, ఒక మేకపిల్ల, ఒక ఉడుత - ఈ మూడు జంతువులు ఎంతో స్నేహభావంతో శ్రీరమణుల చుట్టూ ఆడుకోవడాన్ని వీళ్ళిద్దరూ గమనించారు. శ్రీ రమణులు కాళ్లు ముడుచుకుని కూర్చుని ఉన్నారు. వారి ఎడమ చేతిలో ఒక కాగితంతో తయారు చేసిన పొట్లం ఉంది. ఆ పొట్లంలో వేరుశనగ పప్పులు ఆ మూడు జంతువులకు తినిపిస్తూ, మధ్య మధ్యలో శ్రీరమణులు కూడా తింటున్నారు. రమణులు, "ఛీ!! కొంటెవాడా!!" అని బహుశా ఆ కోతిని ఉద్దేశించి అన్నారు కాబోలని నారాయణ గారికి మరియు పార్థసారథి గారికి అనిపించింది. ఉడుత నోట్లో శ్రీరమణులు పెట్టబోతున్న వేరుశనగ పప్పులను లాక్కోవడానికి ప్రయత్నించిన కారణంగా ఆ కోతిని మందలిస్తున్నట్టుగా అనిపించింది. ఆ జంతువులు వేరుశెనగ పప్పులను శ్రీరమణుల చేతుల మీదుగా అందుకొని ఎంతో ఆస్వాదిస్తున్నట్టు కనపడ్డాయి. అంతేకాకుండా ఆ జంతువుల రూపాలు వేరైనప్పటికీ ప్రాణ స్నేహితుల వలె శ్రీరమణుల చుట్టూ చేరి సాయంసంధ్య వేళ చక్కగా ఆడుకోవడాన్ని చూసిన నారాయణ గారు, పార్థసారథిగారు ఎంతో ముచ్చటపడ్డారు!!

కాయగూరల తోటలో ఈ చక్కటి దృశ్యాన్ని చూసినప్పుడు వాళ్ళిద్దరికీ కలిగిన అనుభూతి వర్ణనాతీతం. కాగితం పొట్లంలో వేరుశెనగ పప్పులు అయిపోగానే శ్రీరమణులు కాగితాన్ని పారేసి, "పొంగోడా..." (పొండి..) అని అన్నారు. ఆ మూడు జంతువులని ఉద్దేశించి భగవాన్ అన్న ఈ వాత్సల్యభరితమైన మాటలు ఒక తాతగారు వారి మనుమలను అన్నట్టు అనిపించింది. శ్రీ భగవాన్, "పొండి" అని అనగానే ఈ మేక, ఉడుత మరియు కోతి ఆ తోటలో నుంచి వెళ్లిపోయాయి.

అవి వెళ్లిపోగానే శ్రీరమణులు అక్కడినుంచి లేచారు. అలా కాయగూరల తోటలో నుంచి శ్రీరమణులు నెమ్మదిగా వరండాలోని సోఫా పైకి వచ్చి ఆసీనులైనారు. శ్రీరమణులను తొలిసారిగా దర్శించుకున్నటువంటి నారాయణ గారు మాటలకు అందని ఒక దివ్యమైన స్థితిలోనికి వెళ్లిపోయారు. శ్రీరమణుల నేత్రములు ఈ భౌతిక ప్రపంచాన్ని కప్పివేసే దివ్య తెరల వలె నారాయణ గారికి గోచరించాయి. మరి ఈ భౌతిక ప్రపంచాన్ని కప్పివేసే ఆ తెరల వెనుక నిత్యాగ్నిహోత్రాన్ని పోలిన జ్ఞాన కాంతిని శ్రీ నారాయణ గారు దర్శించి తరించారు. ఆ తెరల మధ్య నుంచి వేల ఆదిత్యులు వెదజల్లే వెలుగు రేఖలు అక్కడ కూర్చున్న భక్తులను ఒక కాంతి సముద్రంలో ముంచి వేస్తున్నట్లుగా నారాయణ గారికి తోచింది. శ్రీరమణుల కృపానేత్రములు అక్కడ కూర్చున్న ఏ భక్తుని కళ్ల మీద పడినా వాటిని చల్లగా చూస్తేనే ఉన్నాయి. శ్రీ రమణుల జ్ఞాన కాంతి నేత్రాల నుండి ప్రసరిస్తున్న దివ్యానుగ్రహ వెలుగు,

భక్తుల హృదయాలలోకి చొచ్చుకొని పోయి వారి హృదయంలో దీపాన్ని వెలిగిస్తున్నట్లుగా నారాయణ గారికి అర్థమైంది. మనకున్న పరిమిత అవగాహనతో అమిత విస్తృతమైన శ్రీరమణుల మహాద్భుత ఆధ్యాత్మిక శక్తిని సంపూర్ణంగా ఆకళింపు చేసుకోవడం దుర్లభం. శ్రీ రమణుల వైభవం మన మానవ మేధలో ఇముడుతుంది అని అనుకోవడం కేవలం మన భ్రమే అవుతుంది సుమీ... వారి ఆధ్యాత్మిక సౌరభంలో నలుసంత భాగమే భక్తులైన మనకు గోచరిస్తుంది. ఎందుచేతననగా మనము ఇంద్రియ వశులం కాబట్టి, ఇంద్రియాలు విధించే పరిమితులకు లోనైన మనం అఖండమై నటువంటి శ్రీరమణ వైభవంలో రవ్వంతే అర్థం చేసుకోగలిగి నప్పటికీ, మనకి తెలియపడే ఆ చిన్ని నలుసు కూడా అంతులేని ఆనందాన్ని ప్రసాదిస్తుంది.

శ్రీరమణులు సోఫా పై ఉన్న దిండు మీద చేరగిల పడ్డారు. శ్రీరమణుల వదనాన్ని చూస్తూ అక్కడున్న భక్తులంతా కూర్చుని ఉన్నారు. వరండాలో ఎటువంటి మాటలు లేవు.. రవ్వంత శబ్దం కూడా లేదు.. కానీ దివ్యమైన మౌన స్థితి ఆవరించి ఉన్న ఆ ప్రదేశం ఒక దివ్య క్షేత్రమైన పరంధామంగా శ్రీ నారాయణ గారికి గోచరించింది.

అది ఒక సజీవమైన అనుభూతి. శ్రీరమణ సన్నిధిలో అక్కడ కూర్చున్న వారి అంతరంగం ఆనందడోలికలలో విహరించుచున్నది. ప్రతి భక్తుడి అంతరంగము గురు రమణులతో ఏదో ఒక దివ్య సంబంధాన్ని ఏర్పరచుకుంటున్నది. ఇలా, నారాయణ గారికి సమయం ఎలా గడుస్తున్నదో తెలియనేలేదు.. వారి హృదయము

ఆనంద పారవశ్య స్థితిలో రమించిపోతున్నది. మళ్లీ కాసేపటికి వారి మనసులో కాయగూరల తోటలో వారు చూసిన దృశ్యం మెదిలింది. శ్రీరమణుల ప్రేమను వారి సొత్తుగా భావించి వారి దరి చేరిన మేకపిల్ల, అల్లరిచేస్తున్న కోతి మరియు వేరుశనగ పప్పుల కోసం తికమక పడుతున్న ఉడుత చొరవ.. ఇవన్నీ కూడా కళ్ళకు కట్టినట్టుగా కనిపించాయి నారాయణ గారికి. తోటలోని వేరుశెనగ పప్పు విందు ఎల్లప్పటికీ వారి మనసులో చెరగని ముద్ర వేసింది. ఇలా కాసేపు గడిచాక శ్రీరమణులు సోఫా మీద నుంచి నెమ్మదిగా లేచారు. నారాయణ గారు, పార్థసారథి గారు, ఇంకా అక్కడున్న భక్తులంతా కూడా అక్కడ నుంచి లేచారు. అందరూ తమ తమ వసతిగృహాలకు బయలుదేరారు. జీవితంలో అంతకు పూర్వం ఎన్నడు చవిచూడని శాంతి మరియు సంతోషము నారాయణ గారి మదిలో అంకురించాయి.

అక్కడ కూర్చున్న ప్రతి భక్తుని ముఖంలోనూ ఈ ఆనందాన్ని నారాయణ గారు పసికట్టారు. రైల్వే కంపార్ట్మెంట్ ఎక్కడానికి ప్రయత్నిస్తున్న క్షణం నుంచి రతీలాల్‌ని గమనిస్తున్న నారాయణ గారికి అతడిలో కొత్త ఉత్సాహం కనిపించింది. ఈ నూతనోత్సాహానికి శ్రీ రమణుల దివ్యమైన దర్శనమే కారణమని వారు గ్రహించారు!!

శ్రీరమణులు రతీలాల్ కలలో చేసిన వాగ్దానం పనిచేయడం ప్రారంభించినట్టు వారికి అనిపించింది. శ్రీరమణుల వద్ద సెలవు తీసుకుని, రతీలాల్‌ని అతనితో పాటు వచ్చిన పనివాడిని సాగనంపి నారాయణ గారు మరియు పార్థసారథి గారు వారి బసకి చేరారు.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. 1953వ సంవత్సరంలో నారాయణగారు రాజ్కోట్‌లో ఒక హోటల్లో బస చేయడం జరిగింది. హోటల్ భోజనశాలలో రమారమి 30 ఏళ్ల యువకుడు నారాయణ గారిని పలకరించాడు. "నారాయణ గారు! నన్ను గుర్తుపట్టలేదా? నేను రతీలాల్‌ని!! భగవాన్ రమణుల దర్శనం ఐదు సంవత్సరాల క్రితం మనమంతా కలిసి వెళ్లి చేసుకున్నాం.. గుర్తుందా?" అని అన్నాడు. గుర్తుపట్టలేనంత సన్నగా, చురుకుగా తయారైన రతీలాల్‌ను నారాయణ గారు గుర్తుపట్టడానికి కాసేపు పట్టింది. అతని ముఖం ఆరోగ్యంతో, ఆనందంతో వెలిగిపోతోంది. అంతే కాకుండా రతీలాల్ సన్నగా ఉన్నప్పటికీ, బలిష్టంగా ఆరోగ్యంగా ఉన్నాడు.

రతీలాల్ నారాయణ గారితో బోళ్ళు కబుర్లు చెప్పి, కరచాలనం చేసి సెలవు తీసుకున్నాడు. వెళ్ళేముందు, "శ్రీరమణులు వారి మాటను అక్షరాలా నిలుపుకున్నారు. మా వ్యాపారాన్ని ఇప్పుడు నేనే చూసుకుంటున్నాను. నాకు రెండేళ్ల కొడుకు కూడా ఉన్నాడు. భగవాన్ అనుగ్రహంతో నా జీవితం సాఫీగా సాగిపోతోంది" అని ఎంతో ఆనందంగా నారాయణ గారితో పంచుకున్నాడు.

ఇదంతా అయ్యాక నారాయణ గారి మనసు మళ్ళీ కాయగూరల తోటలో ఏర్పాటు చేయబడ్డ వేరుశనగ విందు వైపుకు మళ్ళింది. వారు ఆ నలుగురు మిత్రుల వాత్సల్యాన్ని, స్నేహాన్ని తలుచుకుంటూ ఆనందపరవశులైనారు. నోరులేని ఆ మూగ జంతువుల మీద శ్రీ రమణులకు ఉన్న ప్రేమానురాగాలను గుర్తు చేసుకుంటూ శ్రీ రమణ స్మరణ కొనసాగించారు, నారాయణ గారు.

# దారి చూపిన సౌదామిని (వజ్ర వైరోచని-ఛిన్నమస్త)

రేణుక అయ్యల సోమయాజుల

దృష్ట్వా దృష్ట్వా ద్రష్టుః శక్తిం లోచన మండల మధ్యే భాన్తీమ్
అవిముచన్యః పశ్యతి ధీరో యత్కించి ద్వాతమవత్యైంద్రీ

(లోచన మండల మధ్యమమున ప్రకాశించుచు చూచే వాని ప్రతీ దృష్టి యందును దర్శన శక్తిని విడువక దృఢముగా గ్రహించి చూచుచుండు ధీరుని ప్రచండచండి (ఇంద్రాణి) రక్షిస్తుంది)

విద్యుత్ రెండు రకాలు. అందు మొదటిది మూలమై యొప్పుచు, చలనగతిలో ఆ శక్తిని నిర్దేశించునది. రెండవది సృష్టి నిర్మాణ దశలో క్రియాశీలక పాత్ర వహిస్తూ సృష్టియందు పరిణమించి ప్రకాశించేది. ఒకటి ఆత్మ యందు నిలకడగా ప్రకాశిస్తే, రెండవది సృష్టితో పాటు చలన గమనాదులను పొందుతూ కాలాన్ని విధించేది మరియు మనస్సు, బుద్ధి యందు కూడా వెలిగేది. ఇలా చెప్పబడిన రెండు వర్గాలలో మొదటిది ఛిన్నమస్త శక్తిగా (Pure Consciousness) ఇంద్రియ వ్యాపారాదులకు మూలమై వెలిగే మనోబుద్ధుల రశ్మి కళలకు దూరమై వుంటుంది. మనోస్థానమైన శిరస్సు ఆమెకు లేకపోవుట యందలి రహస్యమిది. కావున మూర్తి వివరణలో ఆమెను 'అశిరమ్మగా' (శిరము లేని అమ్మగా) చూపించారు.

ఈమె రూపమునందు ఇంచుమించు కాళికను పోలి యుండును. తల నరకబడి చేతియందు వుండుట, మొండెము నుండి మూడు రక్త ధారలు ఉబికి స్రవించుట, అందు రెండు

రక్తధారలను ప్రక్కనున్న దేవతలు త్రాగుతున్నట్లు వుండుట, మెడలో ముండమాల, గురివింద గింజల దండ, నాభియందు ప్రకాశితమై యొప్పు సూర్యబింబము వలే కనిపించును. రతీమన్మథులు ఈమెకు ఆసనమై యొప్పుచున్నారు. ఈమెది యోగినీ రూపము మరియు దశమహావిద్యలలో ఈమె ఆరవ దేవత.

## వజ్రవైరోచనియే ప్రచండ చండిక

తాను వెలుగై సమస్తాన్ని వెలుగుతో నింపుతూ ఈశుడు "విరోచనుడు" అన్న పేరుతోను, ఈశ్వరి అయిన ఇంద్రాణి "వజ్ర" అన్న పేరుతోను కీర్తి చెంది యున్నారు. ఇలా శక్తీశ్వరులు వజ్ర వైరోచనులు అయ్యారు. ఇంద్రాణీ, ప్రచండ చండికలు నామభేదమే కాని రూప భేదం లేదు. విద్యలకు దేవత అయినందువల్ల కూడా ఈమెకు "ఇంద్రాణీ" అన్న పేరు వచ్చింది.

## చండిక యొక్క అధిలోక రూపమే "రేణుక"

సృష్టి నిర్మాణానికి రజో ఆకాశంలో రజస్సును ముక్కలు చేయాలి. అనగా వర్గీకృతం చేయాలి. అప్పుడే రూపనిర్మాణం సాధ్యం అవుతుంది. అంతేకాదు, ఆ రజస్సులో కూడ శక్తి ప్రవేశించాలి. అప్పుడే కదలిక ఏర్పడుతుంది. ఇలా రజస్సును పుప్పొడిలో విభజించే శక్తియే రేణుక. ఆకాశంలో కనిపించే పాలపుంత (Milky way) ను రేణుకా శక్తిగా కీర్తిస్తారు. ఆమె దుర్భేద్యం గావున "దుర్గ" అని కూడ పిలవబడుతుంది. "ఛిన్నమస్త" అనునది రేణుక యొక్క నామాంతరము. ఆత్మ విచారణకు వస్తే కాళీ, ఛిన్నమస్త రెండు శక్తుల తత్త్వాలూ ఒక్కటే. శరీరంలో అంతటా చరించేది కాళిక ఐతే, కేవలం సుషుమ్నా నాడియందే వుండేది

ఛిన్నమస్త. మనలో మూలాధారము నుండి శిరస్సు వరకూ వ్యాపించి వుంటుంది. సుసుమ్నా నాడి. దీనిని పశ్చాన్నాడని, అమృత నాడి యని కూడా అంటారు. యోగులు యోగం ద్వారా ఇందలి చండికా శక్తిని జాగృతం చేసి శిరస్సు వరకూ వ్యాపింప చేస్తారు. సుషుమ్నా నాడికి ఇరువైపులా ఇడా, పింగళా అను నాడులు కలవు. వాటినే "ఢాకిని, వర్ణిని" అంటారు. ఛిన్నమస్త మొండెము నుండి విరజిమ్మిన మూడు రక్తపు ధారలున్న రూపములో చూడవచ్చు. అవి నిజానికి రక్తపు ధారలు కావు. అమృత ధారలు. అందు రెండు ధారలను ఢాకిని, వర్ణిని అను దేవతలు త్రాగుతున్న ట్లుగా రూపకల్పన చేసివున్నారు. అనగా అమృతత్త్వము ఇడ, పింగాళా నాడులకు తర్పణము గావింపబడుట. మూడవ ధార సహస్రారమును తడుపును. ఈ విధంగా శీర్ష-కపాలములను ఛేదించిన యోగి అమృతానంద రసామృతం త్రాగుతుండును. ఛిన్మమస్త యొక్క ఆధ్యాత్మ తత్త్వమిది. "రాయస్కామో వజ్రహస్త సుదక్షిణాం పుత్రోన పితరం హవే". ఇది గణపతి ముని దర్శించిన ఛిన్నమస్తా మంత్రము.

## "నాయనకు" దారిచూపిన "ఛిన్నమస్త"

దృష్టి విస్తృతం అవుతున్న కొద్దీ భావం విస్తృతం అవుతుంది. అలాగే పరిమితం నుండి అనంతంలో అమ్మను చూడాలంటే ఆమె పుట్టుకను కొండకు మాత్రమే పరిమితం కానీకుండా సాకారం నుండి నిరాకారం వరకు చూడాలి. ఉత్కళ దేశము నందు భువనేశ్వరము-బాలేశ్వర్ మధ్యన ధిన్ మండల్ అనే రైల్వేస్టేషన్ ఉంది. అక్కడికి సుమారు 5 కి.మీ. దూరమున దంతెవాడ అను జమీందారీ గ్రామము కలదు. గణపతి యొక్క కీర్తి ప్రతిష్ఠలను విన్న దంతేవాడ

జమీందారు తన గ్రామము నందు పండిత సభ ఏర్పాటు చేసాడు. మందసా రాజు ద్వారా గణపతికి ఆహ్వానము పంపించినాడు. గణపతి ముని తన సోదరుడైన శివరామ శాస్త్రితో కలసి ఆ పండిత సభకు వచ్చి తన ప్రతిభ చూపి అందరి మెప్పులు అందుకొన్నాడు. రాజు ఎంతగానో సంతోషించి అతనిని సత్కరించాడు.

ఆ సాయంత్రము సభ ముగిశాక ధిన్ మండల్ స్టేషన్ చేరుటకు రెండెడ్ల బండిలో వారిరువురు బయలుదేరుతారు. ఎడ్ల బండి ఊరు దాటగానే అనుకోని రీతిగా కారు మేఘాలు క్రమ్ము కున్నాయి. కుండపోతతో వర్షము ప్రారంభమైనది. చుట్టూ చిమ్మ చీకటి క్రమ్మి దారి కనిపించ లేదు, పైగా వర్షానికి వారు పూర్తిగా తడిసిపోయారు. రోడ్డంతా జలమయం కావటంతో ఎడ్లు కుంటుతూ - కుంటుతూ అడుగులు వేయసాగాయి. ఆగుదామంటే చుట్టు ప్రక్కల ఎక్కడా ఆశ్రయం కనిపించలేదు. ముందుకు కానీ వెనుకకు గానీ వెళ్ళలేని పరిస్థితి ఏర్పడటంతో బండివాడు బండి తోలుటకు భయపడసాగాడు.

పరిస్థితి విషమించిందని తెలిసిన గణపతి కండ్లు మూసుకొని దేవిని ప్రార్థించినాడు. ఆశ్చర్యము. గుండెలు బ్రద్దలయ్యేటట్లు పెద్ద శబ్దమైనది. ఆకాశమున దట్టముగా క్రమ్మియున్న కారు మేఘములు రెండుగా బ్రద్దలు కాగా అందుండి ఒక ప్రకాశవంత మైన విద్యుల్లత తళుక్కుమని వెలిగింది. దారి తప్పి గోతిలో పడవలసిన బండి ఆ వెలుతురికి కళ్ళు చివుక్కు మనటంతో ఎడ్లు ఆగిపోవటం వలన ప్రమాదం తప్పింది. ఆ వెలుతురులోనే బండి దారి తప్పిందని గ్రహించి బండివాడు దిగి మరల బండిని దారిలో పెట్టి ''హమ్మయ్యా! గండం గడిచింది'' అని నిట్టూర్చాడు. అలా

వెలువడిన సౌదామిని మాటిమాటికీ తన కాంతిని ప్రకటిస్తూ వారికి దారి చూపింది.

గణపతి తన యోగ నిష్ఠలోనే వున్నాడు. ప్రకాశదీప్తమైన సౌదామిని అతని హృదయము నందలి చిన్మయ ప్రకాశముతో తాదాత్మ్యము కలిగినది కాబోలు, ఆ పరాశక్తి యొక్క "తటిత్" రూప దర్శనాన్ని నాయనగారు ప్రచండ చండీ త్రిశతిలో వర్ణిస్తారు.

పర్వతశ్చ పులోమాచః సజలోయం ఘనా ఘనః

పార్వతీతి తటిద్దేవీం పౌలోమీతిచ తాం విదుః

(పర్వతము, పులోమ అను పదములు సజల మేఘము యొక్క నామములు, కావున అందుండి వెలువడు పార్వతియే సౌదామిని. ఆమెయే పౌలోమి (ఇంద్రాణి) యగుచున్నది).

"ఆత్మ దర్శనం ఇప్పుడు ఈ క్షణం కలుగుతుంది. ఇంతకీ నీ దృష్టి పరిపక్వత కలిగి వుండాలి" అని చెప్పియున్నారు, శ్రీ భగవాన్. దృష్టి పరిపక్వత అంటే ఇదే అనాలి. అందరికీ సామాన్యంగా కనిపించే మెరుపునందు పరమేశ్వరీ దర్శనం పొందాడు గణపతి. ఇది అతని తపస్సు యొక్క పరాకాష్ఠకు నిదర్శనము.

పార్వతీ జననము, కళ్యాణము అని వేడుకలు జరుపుకోవటం మనకు అలవాటు. పుట్టుక కలిగిన శక్తికి రూపం ఉండాలి కదా! అదియే "తటిత్" (మెరుపు) రూపము. విద్యుత్తు నందు అగ్ని అంతర్లీనమై వున్నది. శబ్దము ఇందునుండి వచ్చును. వినాయకుడు శబ్దమునకు అధిపతి. కావున శబ్ద బ్రహ్మగా అతడు విద్యుత్తు నుండి జనించిన వైద్యుతాగ్ని. తల్లీ - కొడుకుల తాత్త్విక రూప దర్శనమిది.

# You are Not the Doer
## (Talk 87)
Dr K Subrahmanian

The moment our children begin to have a mind of their own, we alternate between happiness and unhappiness. We would like them to be happy, and so we advise them. You want your son to be an engineer; whereas, he wants to be a doctor. You want your son to be what you would like him to be, and he wants to be what he wants to be - he has a mind of his own. As he gets older, things become more complicated. When he has his own family, you realise that he is more interested in his own son than he is in you. You feel that he should pay more attention to you for what you have done. You feel hurt when he doesn't; you feel ignored. On such occasions, it is human to think that you are no longer needed in this world.

We need to realise that affection is one thing and attachment another. For example, can anyone say his attachment to his wife and children is greater than his attachment to himself? We all know that if there is one person whom we are totally attached to, it is ourselves. The wife might say she couldn't live without her husband, and the husband might say he couldn't live without his wife. But we all know that these are mere words; we don't really mean them. Otherwise, there wouldn't be widows and widowers. Therefore, when somebody says that he cannot live without another person, he is saying something

he doesn't really mean. As far as our children are concerned, we must understand that we don't own them; they do not belong to us. Though we do many things for them to make them independent, they don't belong to us at any time. But because of our attachment to them, we build castles in the air about how they will be with us all the time. These things don't happen. Our parents must have wanted the same thing, and look what happened - we became independent of them.

